క్లుప్తంగా

పీలా మాధవికి మళ్ల అభినందన


మాధవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ వెస్ట్ పరిధి లీగల్ సెల్ ఇన్‌చార్జిగా 61వ వార్డు ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది పీలా మాధవిని పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో ఆమెను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అభినందించారు. మళ్ల క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. వరించి వచ్చిన పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేయాలన్నారు.

నేడు జోడుగుళ్ల అమ్మవార్ల పరస

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం, జవహర్‌నగర్ వద్ద కొలువుదీరిన జోడు గుళ్ల అమ్మవార్లు (కుంచిమాంబ, దుర్గమాంబ) పరస మహోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. ఉదయం నుండి ఇక్కడ కొలువుదీరిన ఇద్దరు అమ్మవార్లకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో జోడు గుళ్ల అమ్మవార్ల పరసకు ప్రత్యేకత ఉంది. ఎంతో ఘనంగా జరిగే ఈ పరస మహోత్సవాలను చూసేందుకు పారిశ్రామిక ప్రాంత వాసులే కాక నగర నలుమూలల నుండి జనం వస్తారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు


గోపాలపట్నం: పాతగోపాలపట్నం ఫీడర్ ప్రాంతంలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతగోపాలపట్నం, భగత్‌సింగ్‌నగర్, నేతాజీ వీధి, యర్ర చెరువు, గణేష్‌నగర్, ఖార్వేల్‌నగర్, నాయుడు క్వార్టర్స్, రైల్వే స్టేషన్ రోడ్డు, రవీందర్‌నగర్, విద్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్మృతి చిహ్నం ప్రారంభం


స్మృతి చిహ్నాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసన్ గోపీనాథ్

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని 616 మంది పురుషులుండే వసతి భవనం ఐఎన్ఎస్ వీరబాహు వద్ద నిర్మించిన స్మృతి చిహ్నాన్ని గురువారం డీజీఎన్‌పీ శ్రీనివాసన్ గోపీనాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు. 1971 ఇండో-పాక్ యుద్ధంలో బ్రేవ్ హార్ట్ సబ్‌మెరైన్ కెప్టెన్, మహావీరచక్ర గ్రహీత ఎంఎన్ఆర్ సమంట్ గౌరవార్థం దీనిని నిర్మించారు.

హెలికాప్టర్ మ్యూజియం పనులు కొలిక్కి


పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్

విశాఖ సిటీ : యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం బీచ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న హెలికాప్టర్ మ్యూజియంతో పాటు మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. తుది దశకు చేరిన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ ప్రాజెక్టుల్లో పచ్చదనం పెంపొందించాలని డీఎఫ్ఓ శివానికి సూచించారు. అనంతరం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో అలాట్‌మెంట్, లీగల్, రెవెన్యూ, పరిపాలన విభాగాల పనితీరును సమీక్షించారు. దుకాణాల వద్ద పేరుకుపోయిన అద్దె బకాయిలను తక్షణమే వసూలు చేయాలని.. లేనిపక్షంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీఈ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు మధుసూధన్, దుర్గాప్రసాద్, రామరాజు పాల్గొన్నారు.

దుర్గంధభరితం

- చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్న గెడ్డలు
- శిథిలావస్థలో రక్షణ గోడలు
- అధికారుల పర్యవేక్షణ లోపం


104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయానికి ఆనుకుని ఉన్న గెడ్డలో వ్యర్థాలు


సుభాష్‌నగర్ పాఠశాలకు ఆనుకుని ఉన్న శిథిలమైన గెడ్డ రక్షణ గోడలు

కంచరపాలెం: జీవీఎంసీ పరిధిలో ఏటా వర్షాకాలం ముందు గెడ్డల సుందరీకరణ, సిల్ట్ తీసేందుకు రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం కనిపించడంలేదు. ప్రస్తుతం ఏ గెడ్డలో చూసినా చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. జోన్-5 పరిధి 56, 57 వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి గెడ్డలన్నీ చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయాలు-1,2కి ఆనుకుని ఉన్న గెడ్డ రక్షణ గోడలు, తుమ్మడపాలెంలోని సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలలకు ఆనుకుని ఉన్న రక్షణగోడ శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా మారాయి. గెడ్డల్లో చెత్తచెదారాలు చేరడంతో దుర్గంధం వెలువడి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది మలేరియా జ్వరాలు సోకుతున్నాయని హడలిపోతున్నారు. పలు ప్రాంతాల నుంచి మురుగునీరు, వర్షపు నీరు ఈ గెడ్డలోకి వస్తుంది. కానీ నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు గెడ్డల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని గెడ్డలు ఉండడంతో కోడిమాంసం వ్యాపారులు వ్యర్థాలను యథేచ్ఛగా గెడ్డలోనే పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ప్రజలు కూడా ఇళ్లలో పాడైన వస్తువులు, చెత్తను గెడ్డలోనే వేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎగువ ప్రాంతాల మీదుగా వెళ్లే మురుగు నీరు చెత్త వల్ల ఎక్కడికక్కడ నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు..

పారిశుధ్య నిర్వహణపై పదేపదే హెచ్చరిస్తున్నా కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో గెడ్డలు, కాలువలు శిథిలం అవుతున్నాయి. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిధిలో సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గొల్లకంచరపాలెం దుర్గానగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు, గెడ్డలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గెడ్డల్లో డెబ్రిస్ వేయడంతో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెబ్రిస్ అడ్డంగా ఉండడంతో గెడ్డలు పూడికలతో నిండిపోతున్నాయి. దీంతో దోమలు విజృంభించి, తరచూ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దుర్గంధభరిత వాతావరణంలోనే విద్యనభ్యసిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గెడ్డలు ఆక్రమణకు గురి కావడంతో పారిశుధ్యం మెరుగునకు ఇబ్బందికరంగా మారుతుందని పబ్లిక్ హెల్త్ సిబ్బంది చెబుతున్నారు. గెడ్డల పునర్ నిర్మాణానికి, పూడికల తొలగింపునకు జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలకు కోరుతున్నారు.


ఇండస్ట్రియల్ ఎస్టేట్ గెడ్డల దుస్థితి

శిథిలావస్థలో కాలువలు

వార్డులో ఎక్కడ చూసినా గెడ్డలు, కాలువలు శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని జోనల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మురుగు సక్రమంగా పారకపోవడంతో దుర్గంధభరితంగా ఉంటుంది. దోమల వృద్ధి ఎక్కువగా ఉండడంతో రోగాల బారిన పడుతున్నాం.

– సంతోష్‌కుమార్, గౌరీనగర్, ఊర్వశి కూడలి,

దుర్గంధానికి ఉండలేకపోతున్నాం

పాఠశాలకు ఆనుకుని ఉన్న గెడ్డల్లో చెత్త తొలగించకపోవడంతో దుర్గంధభరితంగా ఉంటుంది. క్లాస్ సమయాల్లో విండోల నుంచి దుర్వాసన వస్తుంది. దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. పాఠశాల విడిచిపెట్టిన సమయంలో అటుగా నడిచి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. డ్రెయిన్లలో చెత్తాచెదారాలు తొలగించాలి.

– వై.డి. దీక్షిత, విద్యార్థి, కేవీ-1 పాఠశాల, 104ఏరియా.

అధికారులు స్పందించాలి

సుభాష్‌నగర్ గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గెడ్డ ప్రధాన ద్వారాల వద్ద డెబ్రిస్ వేయడం వల్ల మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. ముందుగా ఇంటి నిర్మాణ వ్యర్థాలు వేసి ఆక్రమణ చేస్తున్నారు. పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి.

– బి.సూర్యనారాయణ, సుభాష్‌నగర్, ఐటీఐ జంక్షన్

కేంద్ర మంత్రులకు ఘనస్వాగతం


కేంద్ర మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు

గోపాలపట్నం: స్టీల్ ప్లాంట్‌ను సందర్శించేందుకు కేంద్ర మంత్రులు విశాఖ చేరుకున్నారు. వారికి బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌లను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, కాశీరాజు బాలరాజేశ్వరావు, విజయానందరెడ్డి, పురేంద్ర మోహన్ తదితరులు స్వాగతం పలికారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు


వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో ఆశ్రయం కల్పించిన వృద్ధుడిని గురువారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. చిలకల రాము అనే వృద్ధుడు 15 రోజుల క్రితం ఎన్ఏడీ సెంటర్‌లోని ఫుట్‌పాత్ మీద నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. వృద్ధుడి పరిస్థితి చూసిన షెల్టర్ మేనేజర్ ఏల్లేటి మమత అతనికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. వృద్ధుడు కోలుకున్న తర్వాత అతను చెప్పిన వివరాల ప్రకారం పెందుర్తి ఎస్ఐ సహాయంతో అప్పన్నపాలెం సమీపంలోని జేఎన్ఆర్ కాలనీలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వృద్ధుడిని క్షేమంగా తమకు అప్పగించినందుకు కుటుంబ సభ్యులు మేనేజర్ మమతకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

గోపాలపట్నం: అనారోగ్యంతో మనస్తాపానికి గురైన దేవర సంజీవ్ (52) అలియాస్ పైసలోడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం బుచ్చిరాజుపాలెంలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 90వ వార్డు గొల్ల వీధిలో నివాసముంటున్న దేవర సంజీవ్ గత కొంత కాలంగా భార్యా పిల్లలతో నివాసముంటున్నాడు. అయితే అనారోగ్యంతో కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్నాడు. దీనికి తోడు మద్యం అలవాటు ఉండడంతో అనారోగ్యం మరింత ఇబ్బంది కలిగించిందని స్థానికులు చెబుతున్నారు. కరాసా సాయి బాబా ఆలయం వద్ద ఇసుక, పిక్క లోడింగ్, అన్‌లోడింగ్ పని చేస్తుండేవాడు. బుధవారం ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆకలిగా ఉంది అన్నం పెట్టమని భార్య లక్ష్మిని కోరాడు. ఆమె పెట్టిన అన్నం తిని గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గంట తర్వాత టీ ఇచ్చేందుకు భార్య ప్రయత్నించగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో ఆందోళనకు గురయింది. ఇంట్లో ఉన్న కుమారుడితో కలిసి తలుపు తీసేందుకు యత్నించింది. కానీ తలుపు తెరుచుకోకపోవడంతో స్థానికుల సాయంతో తెరిచి చూసేసరికి సంజీవ్ కర్టెన్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే అతన్ని కిందకు దించి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కేజీహెచ్‌కు తరలించాలని చెప్పడంతో హుటాహుటిన తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతని భార్య లక్ష్మి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇండియన్ నేవీ డైవర్ల నైపుణ్యం


అమితేన్ డ్యామ్ వద్ద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఇండియన్ నేవీ డైవర్లు


నార్త్‌గోవాలో స్లూయిస్‌గేట్ ఎత్తివేస్తున్న ఇండియన్ నేవీ డైవర్లు

సింధియా: గోవా నీటి వనరుల విభాగం అభ్యర్థన మేరకు అమితేన్ డ్యామ్ వద్ద నీటి సరఫరాను అడ్డుకునే స్లూయిస్ గేట్‌ను ఎత్తివేసి నీటి సరఫరాను పునరుద్ధరించడం కోసం ఇండియన్ నేవీ డైవర్లు నార్త్ గోవాలో సహాయక చర్యలు చేపట్టారు. గత ఏడాది జూన్ 27వ తేదీన గోవా ప్రభుత్వ అభ్యర్థన మేరకు జనవరి 28వ తేదీన ప్రారంభమైన ఈ బృందం జనవరి 29వ తేదీన స్లూయిస్ గేట్‌ను ఎత్తివేసి నిరంతరం నీటిసరఫరా పునరుద్ధరణ చర్యలను చేపట్టారు. ఈ బృందం పగలు, రాత్రి పని చేసి సహాయక చర్యల్లో పాల్గొనడం ఇండియన్ నేవీకి గర్వకారణమని నేవీ వర్గాలు తెలిపాయి.

కుష్టురహిత సమాజమే ధ్యేయం


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ : కుష్టురహిత సమాజమే ధ్యేయం కావాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేకపోయినా, చర్మం పాలిపోయినా, ఎరుపు రంగు మచ్చలు, చర్మం మందంగా మారడం, తిమ్మిర్లు రావడం కుష్ఠు వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధిని తొల దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, బంకురు గోపాలం, వెంకటలక్ష్మి, సునీత, వెంకటేష్, పర్వీన్ బేగం, సరోజిని, అప్పలరత్నం పాల్గొన్నారు.

క్వార్టర్స్‌కు రాజు, సన్యాసి జోడీ

ఉత్సాహంగా టెన్నిస్ టోర్నీ


పోటీపడుతున్న రాజు, సన్యాసి జోడీ

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ సంఘం (ఐస్టా) టోర్నీలో భాగంగా గురువారం జరిగిన 70+ కేటగిరీలో డీఎస్ఎన్ రాజు-సన్యాసిరాజు జోడీ హోరాహోరీ పోరులో విజయం సాధించింది. 9-6తో మల్లికార్జునరావు-బిజిరెడ్డి జోడీపై విజయంతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. 35+నుంచి 70+వరకు ఐదు కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆఫీసర్స్ క్లబ్‌లో గురువారం 45+సింగిల్స్‌లో జరిగిన నవీన్, బుజ్జీల మధ్య పోరు సమఉజ్జీగా సాగడంతో టైబ్రేక్‌లో 10-8తో నవీన్ విజయం సాధించారు. రమేష్, సంపత్ కుమార్‌లు ప్రత్యర్థులకు ఒక్క పాయింటే ఇచ్చి గెలుపొందారు. వీఎస్ మూర్తి 9-6తో రామకృష్ణపై విజయం సాధించారు. 35+సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో దత్తుపై 2-9తో నగేష్, మరో మ్యాచ్‌లో బాలకృష్ణ 9-0తో మోహన్‌పై గెలుపొందారు. గురువారం మహిళలకు కూడా పోటీలు నిర్వహించగా కవిత, శైలజ, రజనీకుమారి, ప్రియదర్శిని విజయం సాధించారు.

బాపూజీకి ఘన నివాళులు


ఏకేసీకాలనీలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహాలనే ఆయుధాలుగా చేసుకుని భారతావనికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తీసుకొచ్చిన మహాయోధుడు గాంధీజీ అని కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ మిశ్రా, దేబార్కి కృష్ణ, అడపా రమణ, గురుగుబల్లి బైరాగి నాయుడు, తిరమరెడ్డి వేణు, నారాయణరావు, సూర్యనారాయణ, శేఖర్, తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు


పెంటమాంబ ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న ఉక్కు గుర్తింపు సంఘం నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని నెల్లిముక్కు ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఏప్రిల్‌లో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం, కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ సభ్యులు నిధులు అందజేస్తున్నారని వివరించారు. గత ఏడాది ఖర్చులకు సంబంధించి విరాళాన్ని గురువారం అందజేశారు. సీడబ్ల్యూసీ కార్యదర్శి ఉరుకూటి రమణయ్య, కోశాధికారి నందికి చిన్నారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు మహేశ్వర రెడ్డి, వెంకటరమణారెడ్డి, అప్పలరెడ్డి, శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శాంతి కల్యాణం


శ్రీవారి శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీవారి శాంతి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సాయంత్రం దివ్యక్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రవణ నక్షత్ర యుక్త శాంతి కల్యాణాన్ని అశేష భక్త జనసందోహం మధ్య నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామికి విశేష పూజలు, అర్చనలు, భక్తులకు నిజరూప దర్శనాలు చేపట్టారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

59వ వార్డులో నూతన బోర్‌వెల్ ఏర్పాటు


బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్న కోరమాండల్ సంస్థ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో గురువారం నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచనలతో జనసేన ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి చొరవతో ఏర్పాటు చేసిన ఈ బోర్‌వెల్‌ను వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, సురేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. నీటి కొరత తీర్చేందుకు నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని కాలనీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ సీఎస్ఆర్ విభాగం డిప్యూటీ మేనేజర్ ఎస్.వెంకట రమణ, సీనియర్ ఆఫీసర్ ఉమామహేష్, కాలనీ అధ్యక్షులు వీరన్నరెడ్డి, ఓమ్మి ఈశ్వరరావు, రాజు, రమేష్, జనసేన నాయకులు నాగబాబు, రాజు, కోలా రాము, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో బ్రహ్మకుమారీస్ రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్లు, నాయకులు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో బ్రహ్మకుమారీస్ రథయాత్ర గురువారం పలు వార్డుల్లో సాగింది. తాను పొందిన భగవంతుని ప్రేమను అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో ఈ యాత్రను బ్రహ్మకుమార్ సుభాష్ ప్రారంభించినట్లు బ్రహ్మకుమారీ ప్రతినిధులు తెలిపారు. 4 రాష్ట్రాలు, 65 గ్రామాలు పూర్తి చేసుకున్న ఈ యాత్ర శ్రీహరిపురానికి చేరుకుందని సింధు, మణి, అక్కయమ్మ తదితరులు తెలిపారు. ఏకేసీ కాలనీ, దుర్గానగర్, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో సోమనాథ్ వజ్రశివలింగం రథయాత్రను ఊరేగిస్తూ పరమాత్మ సందేశం వినిపించారు. జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 58వ వార్డు టీడీపీ ప్రధానాధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు భోగవిల్లి నాగభూషణం తదితరులు హాజరై సోమనాథ్ వజ్ర శివలింగాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈఓ ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

సింహాద్రి అప్పన్నకు నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో వేడుకలు జరిపారు.